కళ్లకు గంతలు వీడాలి

- ఎక్కడ చూసినా అధ్వాన దారులే
- కూటమి నేతలు పట్టించుకోక ఇబ్బందులు

సీటీఆర్‌ఐ: అంతన్నారు.. ఇంతన్నారు.. మేము వస్తే చేసేది వేరన్నారు.. చివరికి రోడ్లను అధ్వానంగా వదిలేశారు.. ఈ గుంతలతో నిత్యం రహదారులపై ప్రమాదాలు జరుగుతున్నా, పట్టించుకునేవారే లేకపోయారు.. అయినా మాకెందుకులే అన్నట్లు కూటమి నేతలు కళ్ల గంతలు కట్టుకుని కూర్చున్నారు.. గత ప్రభుత్వ హయాంలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, తాము అధికారంలోకి వస్తే రోడ్లన్నీ అద్దాలుగా మారుస్తామని కూటమి నేతలు ఎన్నికల ముందు ఎన్నో మాటలు చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా రోడ్లు అద్దాలుగా కాదు కదా కనీసం నామరూపాల్లేకుండా చేశారు. వర్షాకాలం వచ్చేలోగా రహదారులన్నీ బాగు చేస్తామని చెప్పిన నాయకుల హామీలు గాలికి కొట్టుకుపోయాయి. కొన్నిచోట్ల రోడ్లపై గుంతలను పూడ్చారు. అవి మళ్లీ యథావిధిగా మారుతున్నాయి.

జిల్లాలో ప్రధాన వాణిజ్య నగరంగా రాజమహేంద్రవరం ఉంది. రోజుకు కనీసం లక్ష మంది వరకూ వివిధ పనుల నిమిత్తం నగరానికి వచ్చి వెళ్తుంటారు. క్రయ విక్రయాలు రూ.లక్షల్లో జరుగుతుంటాయి. అటు కొవ్వూరు, ఇటు కాకినాడ నుంచే కాకుండా అమలాపురం, గోకవరం వంటి ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ వ్యాపారాలు సాగిస్తున్నారు. అంతే కాకుండా నేషనల్ హైవే కూడా ఇక్కడ ఉండటంతో భారీ వాహనాలు కూడా తిరుగుతుంటాయి. ఆటోలు, చిరు వ్యాపారస్తులు, స్కూల్ బస్సులు, రవాణా వాహనాలు, బైక్‌లపై వచ్చి వెళ్లేవారి సంఖ్య అయితే లెక్కే ఉండదు. వీరంతా నగరంలో పలుచోట్ల వ్యాపారులు



కటారినగర్ రోడ్డులో అడుగుకో గుంత

చేసుకోవడానికి వస్తుంటారు. కానీ ఇక్కడ రోడ్ల పరిస్థితి చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. రహదారులు అధ్వానంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనచోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రధానంగా నగరంలోని క్వారీ మార్కెట్ రోడ్డు, లాలాచెరువు రోడ్డు, పేపర్‌మిల్లు రోడ్డు, కోరుకొండ రోడ్డు, తాడితోట సెంటర్, కాతేరు, ఆనంద్‌నగర్, తుమ్మలావ, ఆర్యాపురం, వీరభద్రపురం, కటారినగర్ రోడ్డు, కంబాలచెరువు మదర్‌థెరిసా పార్క్ వద్ద, ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీస్ దగ్గర, **తదితర ప్రాంతాల్లో రోడ్ల మధ్యలో గుంతలు పడడంతో నిత్యం వాహనచోదకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడిచి వెళ్లాలన్నా నరకం చూస్తున్నారు.**

నీరు నిలిచి.. ప్రమాదాన్ని పిలిచి

వర్షకాలం కావడంతో నీరు రోడ్డుపై నిలిచిపోతుంది. అలా నిలిచిపోయిన వర్షం నీరు గుంతల్లో చేరడంతో అది తెలియక వాహనచోదకులు ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. ఇప్పటికే ఇలా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు రోజులుగా వర్షం కురుస్తుండటంతో నగరంలో గుంతల్లో పడి వాహనదారులు అనేక ప్రమాదాల బారిన పడుతున్నారు. మంగళవారం కోరుకొండ రోడ్డులోని క్వారీ మార్కెట్ సెంటర్‌కు వెళ్లే దారిలో ఉన్న గుంతలో పడిపోవడంతో బైక్‌పై నుంచి అదుపుతప్పి ఒక వ్యక్తి పడిపోయాడు. వెనుక వస్తున్న ఆటో అతని చేతిపై నుంచి ఎక్కడంతో చెయ్యి విరిగిపోయింది. ఇంకా వర్షాకాలం మరో రెండు నెలలు ఉన్న నేపథ్యంలో నగరంలోని ఛిద్రమైన రహదారులను బాగుచేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



గోరక్షణపేటలో అధ్వానంగా రోడ్డు



కంబాలచెరువు మదర్‌థెరిసా పార్క్ వద్ద..

● అమాంతం కిందకే..



సగం నిర్మించి వదిలేసిన రోడ్డు ఇదే

కూటమి నేతల ఆలోచనలు ప్రజలను ఇబ్బందులు పాల్జేస్తుందనడానికి ఈ రోడ్డు వేసిన విధానమే నిదర్శనం. బొమ్మూరు వెంకటగిరికొండపైకి వేంకటేశ్వరస్వామి గుడికి, జీపీఆర్ స్కూల్‌కు వెళ్లేందుకు కింద మసీదు ఎదురుగా కొండపైకి రహదారి ఉంది. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం సీసీ రోడ్డును మంజూరు చేసింది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో దానికి బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అదే రోడ్డును మంజూరు చేసింది. అయితే ఆ రోడ్డుకు పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వకుండా అసంపూర్తిగా వదిలేసింది. అటుగా పాఠశాలకు వెళ్లే పిల్లలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. వేయకుండా వదిలేసిన మట్టి రోడ్డులో నడిస్తే కింద పడిపోయే పరిస్థితి నెలకొంది. పాలకులు, అధికారులు ఆ ప్రాంతంలో మెట్లు కడతామని చెప్పినప్పటికీ ఇప్పటివరకూ ఆచరణకు నోచుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి త్వరితగతిన మెట్ల నిర్మాణం చేపట్టాని కోరుతున్నారు.

– రాజమహేంద్రవరం రూరల్

పలువురికి మాజీ మంత్రి పరామర్శ



కొంతమూరులో చినసత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చెల్లుబోయిన వేణు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు గ్రామంలో బుధవారం పలువురిని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. పార్టీ నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగ అధ్యక్షుడు చెరుకూరి సత్యనారాయణ చిన్నాన్న కృష్ణ కుమారుడు చెరుకూరి చినసత్యనారాయణ, పార్టీ నాయకురాలు మరకా రాజేశ్వరి కుమారుడు అనిల్‌కుమార్ ఇటీవల మృతిచెందారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు చెల్లుబోయిన వేణు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, పార్టీ నాయకులు పిల్లి సూర్యారావు, సోమిరెడ్డి సత్తిబాబు, దారా కృష్ణ, ఆనెం శ్రీను, తీటి ప్రసాద్, మెల్లిమి గాబ్రియేలు, ప్రసాద్, ఝాన్సీ, వాణి, నాగమణి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

డెంగీ వ్యాధిని తరిమికొడదాం..

సీతానగరం: చినకొండేపూడిలో డెంగీ నివారణ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీనికి పీహెచ్‌సీ వైద్యులు ఏవీకే చైతన్య, సర్పంచ్ చేరుకూరి శ్రీనివాస్ ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ డెంగీ వ్యాధి దోమ కుట్టడం ద్వారా వస్తుందని, ఈ వ్యాధిని అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందన్నారు. దోమల వృద్ధికి కారణమయ్యే నిల్వ నీరు లేకుండా జాగ్రత్త పడాలని, పాత టైర్లు, కొబ్బరి డొక్కలు లేకుండా చూసుకోవాలన్నారు. నీటి, పూల కుండీల్లో నీరు మూడు రోజులు మించి నిల్వ లేకుండా చూడాలని, ఇంటి పరిసరాల్లో, జనావాసాలకు దగ్గరలోనూ నీటి గుంటలు లేకుండా చూసుకోవాలని అన్నారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేకుండా వెంటనే ఆశ కార్యకర్తలను సంప్రదించి, ఆయా గ్రామాల్లోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎం.ప్రకాష్‌బాబు, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, సూపర్‌వైజర్ కె.సుధాకర్, ఎల్‌టీ శిల్ప, ఎంఎల్‌హెచ్‌పీ కనకదుర్గ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



చినకొండేపూడిలో డెంగీ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

చెత్త డబ్బాలు ఏర్పాటు చేసుకోవాలి

పెదపూడి: గ్రామాల్లో దుకాణాల వద్ద చెత్త డబ్బాలు ఏర్పాటు చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి, దోమాడ గ్రామాల్లో తడి, పొడి చెత్త ఏ విధంగా వేరుగా అందించాలనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకున్న చెత్త డబ్బాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలన్నారు. ఈ చెత్తను క్లాప్ మిత్రలకు అందించాలన్నారు. బిన్ను బ్యాగ్ పద్ధతిలో వారానికి మూడు సార్లు తడి చెత్త, వారానికి ఒక రోజు పొడి చెత్త క్లాప్ మిత్రలు సేకరిస్తారన్నారు. వారు ఆ చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తీసుకువచ్చి తడి చెత్తను ఎరువుగా, పొడి చెత్తను రీసైక్లింగ్ చేస్తారన్నారు. కార్యదర్శి జి.ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

సత్రం.. సమస్యలతో సతమతం

- వీవీ రెడ్డి పంతులు సత్రానికి భారం
- నిర్వహణలో ఇబ్బందులు

కోరుకొండ: కోరుకొండ... ఆధ్యాత్మికతకు నిలయం. ఇక్కడ ఏటా శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. దీనికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బంది రాకుండా ఉండేందుకు అన్న సమారాధనను దశాబ్దాల కిందట ప్రారంభించారు. దీనికి కోటికేశవరం గ్రామానికి చెందిన దివంగత దాత విరియాల వెంకటరెడ్డి పంతులు సత్రాన్ని నెలకొల్పారు. ఉత్సవాల ఐదు రోజులూ అన్నదానానికి ఇబ్బంది రాకుండా ఉండేందుకు 123 ఎకరాల భూమిని, సత్రం నిర్మాణానికి భూమిని, దానితో పాటు భవనం, చుట్టూ ఆరు దుకాణాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వచ్చే ఆదాయం అన్నదానానికి కేటాయించేలా ఏర్పాట్లు చేశారు. అయితే సత్రం నిర్వహణ భారంగా మారుతోంది. సిబ్బంది పెరగడం, దుకాణాల అద్దెలు సక్రమంగా రాకపోవడం ఇబ్బందిగా మారుతుందని అధికారులు, స్థానికులు అంటున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సరిపడా మంది సిబ్బంది ఉన్నప్పటికీ అదనపు సిబ్బందిని కేటాయించడంతో నిర్వహణ కష్టంగా మారుతోంది.

ఎంతమంది సిబ్బంది అంటే..

సత్రంలో నిర్వహించే కార్యకలాపాల నిమిత్తం సరిపడినంత సిబ్బంది ఉన్నారు. ఇక్కడ ఒక గుమాస్తా, ఇద్దరు శానిటేషన్ సిబ్బంది, ఒక డే వాచ్‌మేన్ ఉన్నారు. దేవదాయ– ధర్మదాయ శాఖాధికారులు మరో సిబ్బందిని ఇక్కడ నియమించారు. దీంతో పని తక్కువ, సిబ్బంది ఎక్కువ అన్నట్టయ్యిందని పలువురు అంటున్నారు.

ఆకలి తీర్చుతూ..

ఏటా శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాలు ఐదు రోజుల పాటు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు సుదూర ప్రాంతాలకు చెందిన వేలాది మంది



విరియాల వెంకటరెడ్డి పంతులు సత్రం

భక్తులు హాజరవుతారు. వీరికి మధ్యాహ్నం, సాయంత్రం రెండు పూటలా భోజన వితరణ జరుగుతోంది. అన్నసమారాధనతో భక్తుల ఆకలిని తీరుస్తున్న సత్రానికి ఆదాయం అంతంత మాత్రంగా ఉంది. సేవల్లో ఎటువంటి లోటులేదు. సిబ్బంది సంఖ్య పెరగడం ఇబ్బందిగా మారిందని పలువురు అంటున్నారు.

సత్రానికి 123 ఎకరాల భూమి

ఈ సత్రానికి 123 ఎకరాల మెరక భూమి ఉంది. ఇది కోటికేశవరం, కోరుకొండ, గాదరాడ, జంభూపట్నం, సీతానగరం మండలం నల్లగొండ, నాగంపల్లి గ్రామాల్లో ఉంది. ఈ భూమంతా వర్షాధారమైనది. ఈ భూముల వేలం ద్వారా ఏడాదికి రూ.14,00,000 ఆదాయం వస్తోంది. అలాగే సత్రం వద్ద ఆరు షాపులు ఉన్నాయి. ఇందులో ఒక షాపు ద్వారా మాత్రమే ఏడాదికి రూ.5,500 ఆదాయం వస్తోంది. మిగిలిన నాలుగు షాపులకు చెందిన వ్యవహారం కోర్టులో ఉంది. మరో షాపును నియోజవర్గ ప్రజాప్రతినిధి సమీప బంధువు తీసుకోవడంతో సొమ్ము చెల్లించడం లేదు.

ఇదేమి విధానమో..

రాజమహేంద్రవరం దేవదాయ– ధర్మదాయ శాఖ కార్యాలయంలో ఉద్యోగం చేసే ఓ వ్యక్తికి ఈ సత్రం నుంచే జీతాలిచ్చేవారు. కంప్యూటర్ ఆపరేటర్‌గా చేసిన ఆ యువకుడికి సత్రం నుంచి జీతం ఇచ్చారు. నెలకు రూ. 13 వేల చొప్పున ఇచ్చేవారు. దీంతో సత్రం ఆదాయం తగ్గేది. సత్రంలో పనిచేయకుండా ఎక్కడో పనిచేసిన వ్యక్తికి సత్రం ద్వారా జీతాన్నివ్వడం పట్ల స్థానికులు తప్పుపట్టారు. దీంతో దేవదాయ శాఖ అధికారులు వెనక్కి తగ్గారు. ఇప్పుడు మరో పద్ధతిని అనుసరించారు. ఇక్కడకు ఇంకొకరిని బదిలీ చేశారని అంటున్నారు. దీనివల్ల సేవా కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బంది కలగనుంది. దీనిపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు స్థానికులు ఫిర్యాదు చేశారు.



సత్రంలో స్వామివారి కల్యాణం సందర్భంగా అన్న సమారాధన

వచ్చిన ఆదాయంతోనే...



వీవీ రెడ్డి పంతులు సత్రానికి చెందిన 123 ఎకరాల భూమి, షాపుల వేలం ద్వారా వచ్చిన ఆదాయంతో 50 శాతం అభివృద్ధి, అన్నసమారాధన కార్యక్రమాల నిర్వహణ జరుగుతోంది. మిగిలిన సగభాగంలో 30 శాతం జీతాలకు మరో 20 శాతాన్ని కంట్రిబ్యూషన్, ఆడిట్, సీసీఎఫ్ (కామన్ ఫండ్ సేవా కార్యక్రమాలు) ఖర్చు చేస్తున్నాం. గతంలో రాజమహేంద్రవరంలో బాధ్యతలు నిర్వహించే ఉద్యోగికి జీతం సత్రం నుంచే కేటాయించారు. అయితే ప్రస్తుతం అధికారులు దానిని ఆపేశారు. అదనపు సిబ్బంది ఉంటే భారంగా మారుతోంది.

– జీవీ లక్ష్మీకుమార్, ఈఓ, వీవీ రెడ్డి పంతులు సత్రం

సమస్య రాకుండా చూడాలి



అదనపు సిబ్బందికి సత్రం నుంచే జీతాలివ్వాలంటే భారంగా ఉంటుంది. ప్రస్తుతం మరో సిబ్బందిని కేటాయించడం సరికాదు. గతంతో రాజమహేంద్రవరంలో ఉద్యోగం చేసే వ్యక్తికి జీతం ఇచ్చారు. దానిని స్థానికులంతా వ్యతిరేకించారు. ఈ తరహా సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బొండాడ చందు,
ఆర్యవైశ్య సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు, కోరుకొండ

క్లుప్తంగా

నేడు ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ’

కడియం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ’ కార్యక్రమాన్ని కడియం మండలం మాధవరాయుడుపాలెం గ్రామంలో గురువారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 11 గంటలకు పార్టీ నాయకుడు సంగీత వెంకటేశ్వరరావు ఇంటి వద్ద రచ్చబండ కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పాల్గొంటారన్నారు.

నేడు భారతీయ క్రైస్తవ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న బిషప్ ప్రతాప్ సిన్హా తదితరులు

సీటీఆర్‌ఐ: జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్, రాజమహేంద్రవరం పాస్టర్స్ ఫెలోషిప్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5 గంటలకు స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని సీఎస్ఎన్ చర్చి ప్రాంగణంలో భారతీయ క్రైస్తవ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్, బిషప్ కె.ప్రతాప్ సిన్హా చెప్పారు. ఈ మేరకు బుధవారం ఉదయం చర్చి ప్రాంగణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడతూ క్రీస్తు ప్రేమ, రక్షణ, క్రీస్తు తత్త్వం తెలియపరుస్తూ, భారతీయ క్రైస్తవ దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. హోసన్నా మందిర్, దైవజనులు పాస్టర్ జాన్ వెస్లీ వర్తమానం అందించారు. నగర పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ పి.టాటా విక్టర్, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ సెక్రటరీ జుహాని హాలోనేస్ మాట్లాడుతూ మత మార్పిడి బలవంతంగా చేసేది కాదని, అది విశ్వాసానికి సంబంధించిన అంశమని అన్నారు. జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అడిషనల్ సెక్రటరీ ఎం.విజయసారథి, జి.జాన్‌ప్రసాద్, టి.సుకుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు, రేపు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం గురు, శుక్రవారాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ బుధవారం ప్రకటించారు. దీని ప్రభావంతో కొంతమూరు గ్రామంలోని కల్యాణ్‌నగర్, ఆదర్శనగర్, జంగాల కాలనీ, శేషాద్రి లేఅవుట్, క్వారీ ఏరియా, కంటిపూడి లేఅవుట్ ప్రాంతాలకు ప్రభావం ఉంటుందన్నారు.

పరిశుభ్రతపై శ్రద్ధ పెట్టండి



మురమండ హైస్కూల్‌లో చెత్తను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కడియం: పాఠశాలల పరిసరాల్లో శుభ్రతపై శ్రద్ధ చూపాలని మండల బీజేపీ అధ్యక్షుడు బొర్సు సుబ్రహ్మణ్యం కోరారు. బుధవారం మురమండ హైస్కూల్‌ను స్థానిక నాయకులతో కలసి సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థులకు వసతులు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఆర్వో ప్లాంట్‌లు మరమ్మతుల్లో ఉండడాన్ని గుర్తించారు. అలాగే పరిసరాల శుభ్రతపై పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లారు. నాయకులు చిక్కాల శ్రీనివాస్, గుర్రాల రామ్మోహనరావు, గారపాటి తాతబాబయి, బొప్పన లోవరాజు, నాగం గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోనేరు మురళికి పలువురి పరామర్శ



కోనేరు మురళిని పరామర్శిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పుత్ర వియోగంతో బాధపడుతున్న నగర ప్రముఖులు కోనేరు మురళిని బుధవారం పలువురు పరామర్శించారు. ఇటీవల కోనేరు మురళి కుమారుడు సుస్మంత్ వెంకట్ అనారోగ్యంతో మృతి చెందారు. సుస్మంత్ వెంకట్ చిత్రపటానికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఎండీ రవీంద్రనాథ్, అమలాపురం ఎంపీ జి.హరీష్‌మాధుర్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, ఎండోమెంట్స్ కమిషనర్ కోడూరి శ్రీరామచంద్రమోహన్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అందరి ఆకలి తీర్చాలని..



మిగులు ఆహార పదార్థాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో మార్పు కోసం చేసే ప్రయత్నం ఏదైనా సరైన మార్గంలో వెళ్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని జీవిత బీమా సంస్థ విశ్రాంత ఉద్యోగి డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. ఆ ఆలోచనతోనే మొబైల్ ఫుడ్ వ్యాన్ ద్వారా ప్రతి రోజూ నగరంలోని నిరాశ్రయులకు ఉచితంగా భోజనం అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నగరంలో పెళ్లిళ్లు, శుభకార్యాలు, పెద్దల దిన కార్యాల్లో మిగిలిన ఆహార పదార్థాలను తమ సంస్థకు అందిస్తే, అవసరార్థుల వద్దకు వెళ్లి పంపిణీ చేస్తామన్నారు. అన్నార్తుల వద్దకే అన్నదానం అనే మరో కార్యక్రమం ద్వారా ఉచిత నిత్యాన్నదానాన్ని నిర్వహించేందుకు స్వర్ణాంధ్ర సేవా చర్యలు చేపట్టిందన్నారు. పుష్కరాల రేవు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఐదేళ్లుగా నిరంతరాయంగా భోజనం అందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పెళ్లిళ్లు, శుభకార్యాల్లో మిగులు ఆహార పదార్థాలను సేకరించి ప్రతిరోజూ సాయంత్రం మున్సిపల్ కార్యాలయం వద్ద అందిస్తున్నామన్నారు. ఎవరైనా దాతలు మిగులు ఆహార పదార్థాలు అందించాలనుకుంటే స్వయంగా స్వర్ణాంధ్ర సేవా సంస్థకు పంపించాలని రాంబాబు దాతలను కోరారు.

జీఎంఆర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌గా మురళి



ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన మురళిని అభినందిస్తున్న పూర్వ విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా మెకానికల్ హెడ్ ఆకుల మురళి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన వి.నాగేశ్వరరావు గత నెల 30న ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఆకుల మురళి విశ్రాంత ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మురళిని వివిధ విభాగాల హెడ్‌లు, లెక్చరర్లు, కార్యాలయ సూపరింటెండెంట్, హాస్టల్ సూపరింటెండెంట్, పూర్వ విద్యార్థులు, నాన్ టీచింగ్ స్టాఫ్ అభినందించారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు



ఎస్‌కేవీటీ కళాశాలలో విద్యార్థులతో ఈగల్ టీం

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వాడకంతో దుష్పరిణామాలు, ఈగల్ క్లబ్స్ పనితీరుపై అవగాహన సదస్సు కల్పించారు. ఈగల్ సీఐ పీవీ సూర్యమోహన్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత ముఖ్య పాత్రను వివరించారు. డ్రగ్స్ వాడకంతో చదువుపై ప్రభావం పడుతుందన్నారు. ఈగల్ టోల్ ఫ్రీ నంబరు 1972పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. సుమారు 300 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యం, డాక్టర్ డీవీ రమణమూర్తి, డాక్టర్ పీవీబీ సంజీవరావు, వి.దీప్తి, ఎం.శివప్రసాద్, ఎస్.రాజ్‌కుమార్, అధ్యాపకులు, కళాశాల ఈగల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.
సత్య శ్రీనివాసాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేశవరం రైల్వే గేటు మూసివేత

అనపర్తి: కేశవరం రైల్వే గేటు మరమ్మతుల నిమిత్తం ఐదు రోజుల పాటు మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. గురువారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకూ మూసివేయనున్నట్టు సామర్లకోట సీనియర్ సెక్షన్ ఇంజినీర్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మార్గం నుంచి రాజమహేంద్రవరం వెళ్లే అనపర్తి, బిక్కవోలు మండలాల ప్రజలు వేరే మార్గంలో వెళ్లాలని అన్నారు.

మొక్కజొన్న... బాగుందన్న



రంగంపేట మండలంలో మొక్కజొన్న సాగు

రంగంపేట: మండలంలో మొక్కజొన్న పంట సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. కోటపాడు, వెంకటాపురం, దొడ్డిగుంట, సింగంపల్లి, నల్లమిల్లి, జి.దొంతమూరు, ఈలకొలను, ముకుందవరం తదితర గ్రామాల్లో సుమారు 250 ఎకరాల్లో సాగు చేశారు. ఇతర పంటలను రూ. వేలకు వేలు పెట్టుబడి పెట్టి సాగు చేసినా ఆశించిన స్థాయిలో ధర లేక రైతులు నష్టపోతున్నారు. ఎకరా విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేయడానికి విత్తనాలు, డ్రిప్‌తో కలిపి సుమారు రూ. 20 వేల వరకూ పెట్టుబడి అవుతోంది. పంట కాలపరిమితి నాలుగు నెలలు, కలుపు మొక్కలు, తెగుళ్ల బెడద తక్కువ. ఆదాయం బాగుండడంతో మొక్కజొన్న సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.